

ఆక్రమణలు తొలగించాలి : జెసి

ఆకివీడు : ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను సర్వే చేసి నిర్ధారణ అయితే తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని అజ్జమూరు గ్రామంలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో పలు సమస్యలు అనంతరం మాజీ డిసిసిబి అధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం) జెసితో మాట్లాడారు. తమ గ్రామం కుప్పనపూడి శివారు తాళ్లకోడులో 74 ఎకరాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీ చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయని జెసికి ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయని చెప్పారు. వాటిని తొలగించాలని కోరారు. కుప్పనపూడిలో మరొక రైతు తన పంటపొది గుండా అక్రమంగా తూరలు వేశారని, వాటిని తొలగించాలని ఫిర్యాదు చేశాడు. వీటితోపాటు ఇతర అంశాలను పరిశీలించారు. పరిశీలించిన అనంతరం ఆక్రమణలకు సంబంధించిన మూడు ఫిర్యాదులలో ముందుగా సర్వే చేయించాలని, సర్వే ఫలితాలు తొలగించాలని ఆదేశించారు.

ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం

పుస్తకావిష్కరణ సభలో వక్తలు

గొప్ప నిష్కలంక దేశభక్తుడు రామం

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

మతోన్మాద శక్తులపై పోరాటాలే రామంకు నిజమైన నివాళి

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ






పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబీ

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామీణ ప్రాంతం నుండి ఉద్యమ నేతగా ఎదిగిన ఉద్దరాజు రామం ఉద్యమాల శిఖరం అని పలువురు అభివర్ణించారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ, సిపిఎం నేత ఉద్దరాజు రామం జీవన యానంపై ప్రచురించిన పుస్తకాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఆవిష్కరించారు. స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన పుస్తకావిష్కరణ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఉద్దరాజు రామం గొప్ప నిష్కలంక దేశభక్తుడని అన్నారు. అత్యంత సామాన్య జీవితాన్ని గడిపిన తొలి తరం కమ్యూనిస్టు రామం అని తెలిపారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర పోరాటంలో అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించారన్నారు. దేశ స్వాతంత్రం కోసం అనేక కష్టాలను ఆయన భరించారన్నారు. అనేక సంవత్సరాలు జైలులో నిర్బంధించినా ఆయన పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించారన్నారు. రైతులను, సామాన్య ప్రజానీకాన్ని అనేక పోరాటాల వైపు నడిపించారని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా సుందరయ్యతో కలిసి ఉద్దరాజు రామం గొప్ప పోరాటం చేశారన్నారు. పలు సంఘ సంస్కరణ కార్యక్రమాలు చేపట్టిన రామం అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని తెలిపారు. ప్రస్తుతం మత వివక్ష దేశంలో పెరుగుతోందని, మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాలను విభజిస్తూ ప్రజలను వేరు చేస్తున్నారని తెలిపారు. ఈ పోకడలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఇతర అనేక శక్తులు పోరాటం జరిపాయని గుర్తు చేశారు. ఆ పోరాటంలో వీరోచితంగా పాల్గొన్న నాయకుడు ఉద్దరాజు రామం అని కొనియాడారు. 1957 నుండి 1962 వరకూ పార్లమెంట్ సభ్యునిగా పని చేసిన రామం చట్టసభలో చాలా చురుకైన పాత్ర పోషించారన్నారు. అటువంటి చారిత్రక సమయంలో కేరళ రాష్ట్రంలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ నాయకత్వాన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. అయితే ఆ ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య విరుద్ధంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. ఆ సమయంలో ఉద్దరాజు రామం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిలదీశారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, మతోన్మాద ఫాసిస్టు శక్తులు దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న దేశభక్తుల ఆశయాలకు తూట్లు పొడుస్తున్నాయని తెలిపారు. ఈ శక్తులకు వ్యతిరేకంగా రామం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని విశాల వేదికను ఏర్పాటు చేసి పోరాటం కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ.గఫూర్, మంతెన సీతారాం, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, ప్రముఖులు డివిఎస్.వర్మ, సీనియర్ జర్నలిస్టు ఎం.కోటేశ్వరరావు, రామం తనయుడు ఉద్దరాజు బాపిరాజు, మనవరాలు శారద తదితరులు మాట్లాడారు. పుస్తక రచనలో పాలుపంచుకున్న యు.రామకృష్ణ, భానుప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత వక్తలను కవురు పెద్దిరాజు వేదికపైకి ఆహ్వానించగా చింతకాయల బాబూరావు వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

అనుమానితులంతా అదుపులోకి..!

తుది దశకు డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు విచారణ

ప్రజాశక్తి - ఉండి

యండగండిలో డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు విచారణ తుదిదశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ కేసులో అనుమానితులందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారు వెల్లడించిన వివరాలు, బాధితులు తెలిపిన వివరాలతో మరోసారి సరిచూసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రధాన అనుమానితుడు తిరుమాని శ్రీధర్‌వర్మతోపాటు ఆయన మూడో భార్యగా చెప్పబడుతున్న సుష్మను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. వీరిని భీమవరం ప్రాంతంలోని ఒక రహస్య ప్రాంతానికి తరలించి విచారిస్తున్నారు. ముదునూరి రంగరాజు కుటుంబీకులను ఒకచోట, శ్రీధర్ వర్మ మొదటి భార్య రాణిని మరోచోట, మూడో భార్య సుష్మను మరోచోట విచారిస్తున్నారని తెలిసింది. శ్రీధర్‌వర్మను పోలీసులు గురువారం కొన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి కీలకమైన ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులు శుక్ర, శనివారాల్లో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

బాలోత్సవంలో పాల్గొనండి

విద్యార్థులకు డిఇఒ నారాయణ పిలుపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న బాలోత్సవం-2024 కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు జిల్లావ్యాప్తంగా పాల్గొనాలని డిఇఒ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఒ కార్యాలయంలో బాలోత్సవం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ బాలోత్సవం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవ కమిటీ చీఫ్ అడ్వయిజర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎస్‌సిహెచ్‌బిఆర్‌ఎం హైస్కూల్లో రెండు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కుమార్‌స్వామిరాజు, కెవి.కృష్ణారావు, చిన్నయ్య పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన డిఇఒ

చురుగ్గా అల్లూరి స్మృతి వనం అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - భీమవరం

అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రాంగణాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అజాదికా అమృత్ మహోత్సవం సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ ఉమా నండూరి అన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన అల్లూరి స్మృతి వనాన్ని, అభివృద్ధి పనులను ఆమె కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమా నండూరి మాట్లాడుతూ దేశంలో కొన్ని ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను ఎంపిక చేసి ఆయా ప్రాంతాలకు సంబంధించిన వ్యక్తులు, సంస్థలకు సముచిత స్థానం కల్పించేలా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అనేక ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చిందన్నారు. దీనిలో భాగంగా భీమవరంలో అల్లూరి సీతారామరాజు స్మృతి వనం ఏర్పాటుకు సహకారం అందించడం జరిగిందన్నారు. ఫౌంటెన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్ఫూర్తి వనంలో పచ్చదనం అభివృద్ధితోపాటు అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారీ విగ్రహాన్ని భీమవరంలో ఏర్పాటు చేసుకోవడం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి స్మృతి వనం ప్రాంతాన్ని మరింత సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉమా నండూరి సభ్యులతో సమావేశమై చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. స్మృతి వనం నిర్వహణకు అవసరమైన కార్పస్ ఫండ్‌ను సమీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవాసమితి సభ్యులు విశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు, సిహెచ్.కృష్ణంరాజు, సుబ్బరాజు, నాని రాజు, డాక్టర్ రఘురామరాజు, సిహెచ్.ఝాన్సీలక్ష్మి, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఉమా నండూరి

బాలింతలు బెంబేలు..!

సర్వజన ఆసుపత్రిలో సిజేరియన్ బాలింతలకు రెండు, మూడుసార్లు కుట్లు

ఇన్‌ఫెక్షన్ సోకిందని 15 నుంచి 30 రోజుల వరకూ ఆసుపత్రిలోనే

ప్రశ్నిస్తున్న కుటుంబ సభ్యులపై వైద్యుల దురుసు ప్రవర్తన

ఆసుపత్రిని పూర్తిగా గాలికొదిలేసిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ (మదర్ అండ్ ఛైల్డ్ హెల్త్‌కేర్) బ్లాక్‌లో ప్రసవం చేసుకున్న బాలింతలు అక్కడి పరిస్థితులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్రసవం జరిగిన ఎనిమిది రోజులకు డిశ్చార్జి కావాల్సిన బాలింతలు 15 రోజులు, నెల రోజులైనా ఆసుపత్రిలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్‌ఫెక్షన్ సోకిందంటూ ఆపరేషన్ చేయించుకున్న బాలింతలకు పదేపదే కుట్లు వేస్తూ నరకం చూపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఆసుపత్రిగా ఉండగా గర్భిణుల ప్రసవాల విషయంలో ఎనలేని కీర్తిగడించిన సంగతి తెలిసిందే. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి అధ్వానంగా తయారైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గర్భిణులకు, శిశువులకు ప్రత్యేక వైద్యం అందించేందుకుగాను చాలా ఏళ్ల క్రితం జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఎంసిహెచ్ బ్లాక్ నిర్మించారు. ఎన్నో పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఇక్కడ ప్రసవాలు చేసుకుని ఆరోగ్యంగా తిరిగివెళ్లిన పరిస్థితి ఉండేది. ఎంసిహెచ్ బ్లాక్‌లో దాదాపు వంద బెడ్స్ వరకూ ఉన్నాయి. ప్రతిరోజూ కనీసంగా 150 నుంచి 200 మంది వరకూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులు ఇక్కడ ఓపి సేవలు పొందుతున్నారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిరోజూ ఆరోగ్యశ్రీలో పది మందికిపైగా గర్భిణులకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఆరోగ్యశ్రీలో ప్రసవం జరిగిన బాలింతలను నిబంధనల ప్రకారం ఎనిమిది రోజులకు డిశ్చార్జి చేసి పంపించాలి. చాలా కేసుల్లో అటువంటి పరిస్థితి లేకుండాపోయిందని బాలింతల కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఆపరేషన్ ద్వారా ప్రసవం జరిగిన బాలింతలకు కుట్లు వేస్తారు. ఎనిమిది రోజులకు కుట్లు తగ్గిపోవడం, వాటిని విప్పేసి బాలింతలను పంపించడం జరగాలి. ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతోంది. చాలామంది బాలింతలకు రెండు, మూడుసార్లు కుట్లు వేస్తున్నారు. అదేమని అడిగితే ఇన్‌ఫెక్షన్ అయ్యిందని చెబుతున్నారు. ట్రెయినీ డాక్టర్లతో కుట్లు వేయిస్తున్నారని, అందుకే ఈ విధంగా జరుగుతుందని బాలింతల బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా చాలామంది బాలింతలు 15, నెల రోజులు ఆసుపత్రిలో ఉన్న పరిస్థితి ఉంది.

డాక్టర్లను నిలదీసిన బాలింతల కుటుంబసభ్యులు

పదేపదే కుట్లు పేరుతో బాలింతలకు నరకం చూపించడంతో గురువారం బాలింతల కుటుంబ సభ్యులు అక్కడి వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. దీంతో డాక్టర్లు చాలా దురుసుగా సమాధానం చెప్పడంతో బాలింతల కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. 'మీ ఇష్టం వచ్చినచోట చెప్పుకోండి.. మీరు గొడవ చేస్తే బర్త్ సర్టిఫికెట్ ఇవ్వకుండా చేస్తాం. మీరేమైనా డబ్బులిస్తున్నారా.. ఉచితంగానే కదా చేయించుకుంటున్నారు' అంటూ వైద్యులు ఎదురు దాడి చేశారని బాలింతల కుటుంబ సభ్యులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఆరోగ్యమిత్రల దృష్టికి సైతం బాలింత కుటుంబసభ్యులు సమస్యను తీసుకెళ్లారు. సూపరింటెండెంట్‌ను కలిసేందుకు గురువారం బాలింతల దగ్గర ఉన్న మహిళలంతా వెళ్లగా ఆయన లేకపోవడంతో వెనుదిరిగారు. కొంతమంది తమవారి పరిస్థితి చూసి డిశ్చార్జి చేసేయండి వెళ్లిపోతామని వేడుకుంటున్న పరిస్థితి సైతం ఉంది. బాలింతల వద్ద ఒక వ్యక్తి ఉండటం ఎప్పుడూ జరుగుతోంది. ఇప్పుడు కొత్తగా ఉన్నట్లు 'మీరంతా ఉండబట్టే ఇన్‌ఫెక్షన్ అవుతుందని' అక్కడున్నవారిని తప్పుబడుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో లేని ఇన్‌ఫెక్షన్ ఇప్పుడు ఎందుకు వస్తుందని ప్రశ్నిస్తే మాత్రం సమాధానం లేదు. గురువారం పెద్దసంఖ్యలో బాలింతలకు రెండోసారి కుట్లు వేసినట్లు అక్కడి వారు చెబుతున్నారు. బాలింతలను ఇబ్బంది పెట్టడం వల్ల ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకుంటే ఆసుపత్రిని బట్టి రూ.50 వేల నుంచి దాదాపు రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. పేద కుటుంబాలు ఆ భారం తట్టుకోలేక ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే ఈ విధంగా ఇబ్బంది పెట్టడం ఏమిటని బాలింతల కుటుంబ సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. వెంటనే ఉన్నాతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ బ్లాక్

సమస్యపై డాక్టర్లతో మాట్లాడిన ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ

బాలింతల సమస్యలను గురువారం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ సిహెచ్.వంశీకృష్ణ దృష్టికి బాలింత కుటుంబసభ్యులు ఒకరు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంసిహెచ్ బ్లాక్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా ఈవిధంగా జరుగుతున్నట్లు వైద్యులు సమాధానం చెప్పిన పరిస్థితి ఉంది. సమస్యను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

ప్రసవం జరిగి 12 రోజులైంది.. ఇప్పుడు మళ్లీ కుట్లు వేశారు

బాలిన శ్రీనివాసరావు, బాలింత భర్త, మేదినరావు పాలెం, దెందులూరు మండలం



నా భార్య దీపికను ఈ నెల 13వ తేదీన ఎంసిహెచ్ బ్లాక్‌లో ప్రసవం కోసం చేర్చాను. 14న ఆపరేషన్ చేసి వైద్యులు ప్రసవం చేశారు. బాబు పుట్టాడు. దాదాపు 13 రోజులు గడిచింది. ఇప్పుడు మళ్లీ కుట్లు వేశారు. అదేమని అడిగితే ఇన్‌ఫెక్షన్ అయ్యిందంటున్నారు. అసలు ఎన్ని రోజులకు ఇంటికి పంపుతారో అర్థంకాని పరిస్థితి ఉంది.

రెండోసారి కుట్లు వేయాలంటున్నారు

నక్కా మధుసూదనరావు, బాలింత భర్త, గొల్లగూడెం, ఉంగుటూరు మండలం



నా భార్య అరుణను ఈ నెల 16వ తేదీ రాత్రి సర్వజన ఆసుపత్రిలో ప్రసవం కోసం చేర్చాను. 17న ఆపరేషన్ చేసి ప్రసవం చేశారు. బాబు పుట్టాడు. పది రోజులు గడిచిపోయింది. ఇప్పుడు ఇన్‌ఫెక్షన్ అయ్యిందని చెబుతూ రెండోసారి కుట్లు వేయాలంటున్నారు. అదేమని అడిగితే డాక్టర్లు దురుసుగా మాట్లాడుతున్నారు. ఏం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌ను కలిసి సమస్యను చెప్పాం.


పోరాట యోధుడు మైలా నాగయ్య వర్మ

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

వేలాది ఎకరాల బంజరు భూమిని భూస్వాములపై పోరాడి పేదలకు పంచిన ఘనత మైలా నాగయ్య వర్మకు దక్కుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. మైలా నాగయ్యవర్మ 53వ వర్ధంతి స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనం వద్ద గురువారం నిర్వహించారు. నాగయ్యవర్మ చిత్రపటానికి గోపాలన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ 1965-70 కాలంలో నాటి భీమవరం తాలూకాలో భూస్వాములు ఆక్రమించుకున్న బంజరు భూములు పేదలకు పంచాలని వీరోచిత పోరాట నాయకుడిగా నాగయ్యవర్మ గుర్తింపు పొందారన్నారు. అప్పటి భూస్వాముల గుండెల్లో దడ పుట్టించి పేదలను ఐక్యపర్చడంలో నాగయ్య వర్మ ముందుండేవారని తెలిపారు. అందుకే నాటి భూస్వాములు 1971లో చర్చలకు పిలిచి పథకం ప్రకారం హత్య చేశారన్నారు. తన ప్రాణాలు ఫణంగా పెట్టి పంచిన ఆ భూములు అనేక పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాయన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా మైలా నాగయ్యవర్మ స్మారక ట్రస్ట్ పేరుతో సుందరయ్య భవనంలో జనరిక్ మెడికల్ షాప్ నిర్వహిస్తున్నామని, ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం మాజీ నాయకులు వడుగు వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు మల్లిపూడి ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్, ఎం.కోదండం, నాగు, మెడికల్ షాప్ నిర్వాహకులు ఉష పాల్గొన్నారు.

భీమవరం టౌన్: మైలా నాగయ్యవర్మ పోరాటం నాడు ప్రభుత్వాన్ని కదిలించిందని సిపిఎం నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. గురువారం కొత్త పూసలమూరు, తోకతిప్ప గ్రామాల్లో నాగయ్యవర్మ వర్ధంతి సభలు జరిగాయి. ఈ సందర్భంగా నాగయ్యవర్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఆంజనేయులుతోపాటు ఇంజేటి శ్రీనివాస్, రేవు రామకృష్ణ మాట్లాడారు. ప్రజలు ఐక్యంగా పోరాడితే తప్ప ప్రభుత్వాలు కదలవని నాగయ్యవర్మ పోరాటం రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొడ్డు లక్ష్మీపతి, కొల్లాటి గోవిందరాజు, వల్లభనేని బ్రహ్మం, శ్రీరాములు, బస్వాని నాగరాజు, నరసింహస్వామి, పొన్నమండ నాగేశ్వరరావు, బొమ్మిడి రాంబాబు, కిషోర్, కొల్లాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగయ్య వర్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

లోకల్ హాలిడే ఇవ్వాలి

నల్లబ్యాడ్జీలతో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

స్థానిక అవసరాల రీత్యా విద్యా సంవత్సరంలో మూడు రోజులు స్థానిక సెలవులు ప్రకటించే అధికారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కల్పించారని యుటిఎఫ్ మండల అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్ అన్నారు. లోకల్ హాలిడే ఇవ్వద్దని, పాఠశాల కచ్చితంగా తెరవాలని డిఇఒ తెలపడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా అంతటా గురువారం నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా తెలియజేసినప్పటికీ ఉన్నతాధికారులు స్థానిక సెలవు ఇవ్వడానికి వీలులేదని ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. దీనికి నిరసనగా మండలంలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కోసూరి గోపాలకృష్ణమరాజు, మండల కార్యదర్శి పి.లీలావతి, స్టాఫ్ సెక్రెటరీ కౌరు నాగరాజు, అల్లు శ్రీనివాస్ ఉన్నారు.

నరసాపురం : మండల పరిధిలోని ఉపాధ్యాయులందరూ ఆప్షనల్ హాలిడేలు, లోకల్ హాలిడేల విషయంలో విద్యాశాఖ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ గురువారం అన్ని పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. లోకల్ హాలిడేలు ఇచ్చే విషయం ప్రధానోపాధ్యాయులదేనని, దీనిలో జిల్లా విద్యాశాఖ అధికారులు జోక్యం తగదని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.అజయ్ కుమార్, పి.అరుణ కుమారి పాల్గొన్నారు.

యలమంచిలి : జిల్లాలోని పాఠశాలలకు లోకల్ హాలిడే, ఆప్షనల్ హాలిడేల వినియోగానికి అవకాశం ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖ ఆదేశాల వల్ల బాక్సింగ్ డే రోజు గురువారం తప్పనిసరి పని దినంగా చేయవలసి వచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఇఒ వైఖరిని నిరసిస్తూ ఉపాధ్యాయులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. అనంతరం ఫ్యాప్టో ప్రతినిధులు మండల విద్యాశాఖ అధికారి కెవి.రామకృష్ణంరాజుకు వినతి పత్రాన్ని అందించారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ఎస్‌టియు మండల గౌరవాధ్యక్షులు ఎపి ప్రేమ్ కుమార్, యుటిఎఫ్ మండల శాఖ కోశాధికారి వి.సందీప్ కుమార్, మండల కార్యదర్శులు పెచ్చెట్టి నాగ శ్రీనివాస్, ఎం.రాంబాబు వినతి పత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు పద్మావతి, మండల సహాధ్యక్షులు ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.



మొగల్తూరు : ముత్యాలపల్లిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సంస్కృతీ సంప్రదాయాల్లో పండుగలు కీలకం

ఎంఎల్‌ఎ అంజిబాబుచే సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల్లో పండుగలు ముఖ్యభూమిక పోషిస్తాయని, ఆ పండుగల్లో సంక్రాంతి అతి ప్రధానమైందని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం సంక్రాంతి సంబరాల పోస్టర్ ను ఎమ్మెల్యే అంజిబాబు ఆయన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి పండుగలను గత 36 ఏళ్లుగా వారోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి జనవరి 11వ తేదీ వరకు వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని, గంగిరెడ్లు, డప్పుల వాయిద్యాలు, రంగవల్లులు, భోగి పండగ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, సబిత కాలేజీ ఆధ్వర్యంలో స్థానిక ఎవిఎస్ఎన్ఎమ్ హైస్కూల్‌లో మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జి చేతుల మీదుగా గురువారం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు ఈ మెటీరియల్ వినియోగించుకుని మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దాల వాసు, పెనుమాక రామ్మోహన్ రావు, జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, రావాడ సతీష్, కానూరి ప్రభాకర్, గందం యేసు, హెడ్మాష్టర్ సురేష్ పాల్గొన్నారు.



రైల్వే గేటు వద్ద ట్రాక్‌పై ఉన్న రాళ్లు

అసంపూర్తిగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి - ఉండి

ఉండి-ఆకివీడు రహదారిలోని రైల్వే గేట్ సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైల్వే గేటు వద్ద ట్రాక్ మరమ్మతు పనుల నిమిత్తం 10 రోజుల పాటుగా రైల్వే గేటును మూసివేసారని, కానీ పనులను పూర్తి చేయకుండా రైల్వే గేట్ వద్ద ట్రాక్‌పై పెద్దపెద్ద మెటల్ చిప్స్ వేసి గేటు తెరవడంతో ప్రయాణ సమయంలో వాహనం రైలు పట్టాలు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాహనం జారిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వహించకుండా వెంటనే రైల్వే గేట్ వద్ద రోడ్డును అభివృద్ధి చేయాలని వారు కోరుకుంటున్నారు.

సంక్రాంతి ఆటల పోటీలను విజయవంతం చేయాలి

ఐద్వా పట్టణ కార్యదర్శి ఉదయకుమారి

ప్రజాశక్తి - ఆకివీడు



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయకుమారి

మహిళా కార్యకర్తలందరూ సంఘటితంగా కృషిచేసి పట్టుదలతో సంక్రాంతి క్రీడలను విజయవంతం చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి పిలుపునిచ్చారు. భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పట్టణ సమావేశం డోకల లక్ష్మి అధ్యక్షత గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగింది. ఆటల పోటీల నిర్వహణ నిమిత్తం చర్చల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కుమారి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గత 42 సంవత్సరాల నుంచి మహిళలలో నైపుణ్యాలను వెలుగు తీయడం కోసం ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ వివిధ వార్డుల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ స్థాయిలో స్థానిక రైల్వే స్టేషన్ వద్ద కూడా నిర్వహిస్తున్నామన్నారు. సంక్రాంతి అంటే ఆటల పోటీలు మహిళల నైపుణ్యాన్ని పెంచే విధంగా, ఐక్యం చేసే విధంగా ఈ పోటీలు నిర్వహణ చేస్తున్నామన్నారు. ఈ పోటీలకు మహిళా సంఘం కార్యకర్తలందరూ పట్టుదలగా పనిచేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో కింజరపు పార్వతి, దొడ్డి పద్మ, జివి.లావణ్య, కళ్యాణి, తాయారు, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఫిషరీస్ సొసైటీ అధ్యక్ష ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా వసంతరావు

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా ఫిషరీస్ సొసైటీ ప్రెసిడెంట్ ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా మైలా వసంతరావును ప్రకటించారు. ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం మీరు అందించే విశిష్టమైన సేవలు, ఫిషరీస్ సొసైటీని మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పులపర్తి వెంకటేశ్వరరావు, కొల్లాటి గోపికృష, వాతాడి కనకరాజు, తిరుమాని సీతామాలక్ష్మి, మైల వసంతరావు, రాజా బాలాజీ పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ


ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వాదేశాల ప్రకారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఒకరోజు ముందుగా మంగళవారం అందించనున్నామని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని లబ్ధిదారులు గమనించాలని ఆయన సూచించారు.

పశువధ కర్మాగారాన్ని తొలగించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని తేతలిలో ఉన్న పశువధ కర్మాగారాన్ని మూసి వేయించాలని డిమాండ్ చేస్తూ గో సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మహిళలు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రామరాజ్యం అధ్యక్షులు కొవ్వూరి వీర రాఘవ రెడ్డి మాట్లాడుతూ పశువధశాలను మూసివేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. కర్మాగారం నుంచి మాంసంతో వస్తున్న కంటైనర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్లో అప్పగించి, ఫిర్యాదు చేస్తే కేసు కడతామని చెప్పిన పోలీసులు ఉదయం వెళ్లేసరికి కేసు నమోదు చేయలేకపోయామని చెప్పడం, అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పడం దారుణం అన్నారు. గత కొద్ది రోజులుగా ఇక్కడ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నప్పటికీ అటు జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటు జీవహింసకు పాల్పడుతూ గ్రామాన్ని కాలుష్యంతో నింపుతున్న పరిశ్రమను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గో సేవా సమితి సభ్యులు రాజేష్ నాథ్, జల్లూరి జగదీష్, గ్రామ నాయకులు కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ పాల్గొన్నారు.



ప్రతాప్ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీతల సుజాత

మాధవనాయుడుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు తండ్రి ప్రతాప నాయుడు ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం మండలంలోని సరిపల్లి గ్రామంలో మాధవ నాయుడు నివాసంలో మాజీ మంత్రి, వినియోగదారుల రక్షణ మండలి ఛైర్‌పర్సన్ పీతల సుజాత, జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనులు మాధవ నాయుడు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం

మున్సిపల్ కమిషనర్ అంజయ్య



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం : నరసాపురం పట్ట ణంలోని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటిస్తూ ప్లాస్టిక్ నిర్మూలనపై పట్టణ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పర్యావరణానికి అవరోధం కలిగిస్తున్న వాటిలో ప్లాస్టిక్ అత్యంత ప్ర మాదకరమన్నారు. ఒక ప్లాస్టిక్ వస్తువు మట్టిలో పూర్తిగా కలవాలంటే కొన్ని వేల సంవత్సరాలు పడుతుందని అన్నారు. నానాటికి పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు 1999లో కేంద్రంలోని పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు కూడా జారీ చేసిందని, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 100 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతుందన్నారు. క్యారీ బ్యాగులతో సహా ఎన్నో గృహావసరాలకు వాడి పడేస్తున్న ప్లాస్టిక్ భూమిలో కరిగి పోవడానికి ఎన్నో సంవత్సరాలు పడు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్ పాత్రుడు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట



ఆచంట : మాట్లాడుతున్న తహశీల్దార్

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. కొడమంచిలి రైతు సంఘం కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఆందోళన చెం దవలసిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఇది చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీనివాసరావు, బి.వెంకట్ రమణ, కార్యదర్శి హనుమంతరావు, డిటి రాజ్యలక్ష్మి, ఆర్ఐ జయలలిత, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఉండి: గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించి ప్రజల మధ్య ఎటువంటి విభేదాలు లేకుండా చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఉండి తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. గురువారం ఉండి మండలం కోలమూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో రీసర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు రైతులు గతంలో జరిగిన రీ సర్వేలో సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువచ్చారని, ఈ తప్పిదాలను సరిచేసి, వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోలమూరు గ్రామ ఉప సర్పంచి నడింపల్లి రాంబాబు రాజు, మండల సర్వేయర్ రత్నావళి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామ రెవెన్యూ అధికారి అప్పలాచార్యులు, గ్రామ సర్వేయర్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల



వెంకట రామరాజును సత్కరిస్తున్న సంఘ పెద్దలు

పేదలకు సాయం చేయడం ఆనందంగా ఉందని దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు పేర్కొన్నారు. గురువారం కాళ్లకూరు గ్రామం కొత్త కాలనీ సిబిసిఎన్‌సి, పాతపేటలో ఆర్‌సిఎం, పాతపేటలో సిబిసిఎన్ చర్చిలకు క్రిస్మస్ సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2,200 మంది పేదలకు కమలా పండ్లను పంపిణీ చేశారు. ఏలూరుపాడు గ్రామం గరువులో కమలా పండ్లను అందజేశారు. కాళ్లకూరు గ్రామంలో శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ద్వారా నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అయన చెప్పారు. అనంతరం సంఘ పెద్దలు ఆయన్ని సత్కరించారు.

29న రోడ్ రన్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

పశ్చిమ గోదావరి జిల్లా క్రాస్ కంట్రీ(రోడ్ రన్) జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు తణుకు జాతీయ రహదారిలోని డీ మార్ట్ వద్ద నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతకాయల సత్యనారాయణ, సంకు సూర్య నారాయణలు గురువారం తెలిపారు. ఈ ఎంపికలు అండర్ 16, 18, 20 బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీల విభాగాలలో 2, 4, 6, 8, 10 కిలోమీటర్ల ఈవెంట్స్‌లో జరుగుతాయని, ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడాకారులు పుట్టిన తేదీ ధృవపత్రం, ఆధార్ రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.బాబురావు సెల్.9676251733ని సంప్రదించవలెనని తెలియజేశారు.

పల్లెల్లో ప్రారంభమైన సంక్రాంతి శోభ

ఊరూరా హరిదాసుల సందడి

ప్రజాశక్తి - ఆచంట



హరిదాసుకు కానుకలు సమర్పిస్తున్న మహిళ

పల్లెల్లో సంక్రాంతి శోభ ప్రారంభమైంది. తెల్లవారకముందే శ్రీమద్రమాయణ, గోవిందో హరి అంటూ హరిదాసులు మోటార్ సైకిల్ ఎక్కి మైకుతో, సంకీర్తనతో ఊరంతా సందడి చేస్తున్నారు. పల్లెలు ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి. సంక్రాంతి నెల రోజులూ ప్రతిబింబిస్తాయి. ఈ తరహాలో సంక్రాంతి పండుగ ఆగమనాన్ని గుర్తుచేస్తూ తలపై అక్షయపాత్ర, మెడలో నిలువెత్తు దండ, పట్టు పితాంబరాలు ధరించి.. ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తంబుర.. నుదుటన నామాలు, కాళ్లకు గజ్జలు, విష్ణు నామ స్మరణతో కంగున మోగే కంచు కంఠముతో సంక్రాంతి నెల రోజులూ మన ముంగిట హరిదాసులు దర్శనమిస్తారు. కానీ రోజులు మారే కొలది హరిదాసులు మోటార్ సైకిల్ ఎక్కి పల్లెల్లో తిరుగుతుండడంతో సంస్కృతి సాంప్రదాయాలు కాస్త అటుకెక్కాయి.

29న విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లజపతిరాయ్ పేట మాంటిస్సోరీ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ చదువుతున్న విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అకడమిక్ డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ తెలిపారు. ఈ పరీక్ష ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఆడపిల్లలకి, జనవరి 5, 2025 ఆదివారం ఉదయం 10 గంటలకు మగ పిల్లలకి నిర్వహించబడుతుందన్నారు. ఉదయం పరీక్షకు హాజరుకాలేని విద్యార్థుల కోసం అదే రోజున సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకూ పరీక్ష నిర్వహించే అవకాశం కూడా కల్పించబడిందని తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇంటర్‌లో ఉచిత విద్యతో పాటు రూ.5 లక్షల స్కాలర్షిప్‌లు అందజేయబడతాయని ఆయన తెలిపారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో 50 మార్కులకు నిర్వహించబడుతుందని, పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి రూ.120 విలువ కలిగిన 10వ తరగతి న్యూ మోడల్ క్వశ్చన్ పేపర్ బుక్లెట్ ఉచితంగా అందజేయబడుతుందని వివరించారు. పాలకొల్లు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని విద్యార్థులందరూ ఈ అద్భుత అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ ఎస్‌పిఎస్ ప్రకాశరావు కోరారు. ఈ టెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలకు మాంటిస్సోరి జూనియర్ కళాశాలను సంప్రదించాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్కూల్ లీడర్షిప్ సైకిల్-2 బ్యాచ్-2 సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా భీమవరంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతులకు గురువారం 160 మంది పాఠశాల ప్రధానోపాధ్యాయులకు భాగంగా విభిన్న అంశాలు సమ్మిళిత విద్య, డాటాబేస్ మేనేజ్మెంట్, కొలాబరేషన్, రిసోర్స్ మేనేజ్మెంట్, కరిక్యులం డిజైన్ ప్రిన్సిపల్స్, స్కూల్ సేఫ్టీ, క్లైమేట్ చేంజ్ అను విషయాలపై ఉపాధ్యాయులకు నైపుణ్యాన్ని పెంపొందించినట్లు శిక్షణ పొందుతుంటారని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సిహెచ్ఎస్‌వి.సుబ్రహ్మణ్యం తెలియజేశారు. శిక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం మోనిటరింగ్ ఆఫీసర్ పి.ఏసుదాసు, మాస్టర్ ఫెసిలిటేటర్స్ జి.కృష్ణవేణి, నేతల భీమారావు, జి.శ్రీనివాస్, సిహెచ్.రవికుమార్, ఎస్‌విఆర్ మూర్తి రాజు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణా తరగతులు నాయకత్వ లక్షణాలను మరింత మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడుతుందని పాలకొల్లుకు చెందిన ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ తెలియజేశారు. కైవల్య ఫౌండేషన్ నుంచి ఇద్దరు ప్రతినిధులు శైలజ, పాయల్ స్టేట్ అబ్జర్వర్లుగా వ్యవహరించి శిక్షణా తరగతులు ఆర్గనైజ్డ్‌గా జరిగేలా చూసుకుంటున్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

జనవరి 3, 4, 5 తేదీలలో భీమవరంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గరువారం గణపవరం బిటి రణదీవే భవనంలో జరిగిన సిపిఎం గణపవరం మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశానికి మేడిశెట్టి పెంటారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరసింహ మూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా హామీల అమలు విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని అన్నారు. కేశవరం వెళ్లడానికి ఉండి కాలువపై ఉన్న బ్రెయిలీ వంతెన శిథిలావస్థకు చేరి, ప్లాటు ఫారం ఉన్న రేకులు ఊడిపోయి, నడవడానికి వీలు లేని విధంగా మారటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పట్టీపట్టనట్లు వ్యవరిస్తున్నారని విమర్శించారు. జిల్లా మహాసభ సందర్భంగా మూడవ తేదీన జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బహిరంగ సభకి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం హాజరవుతారని అన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు నరాలశెట్టి రామకృష్ణ, సోడదాసి సంజీవిరావు పాల్గొన్నారు.


వంగవీటి రంగాకు ఘన నివాళి

ప్రజాశక్తి - పాలకొల్లు



భీమవరం టౌన్ : పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల అభ్యున్నతి కోసం ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి, కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా అని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రంగా 36వ వర్ధంతి సందర్భంగా స్థానిక మారుతి థియేటర్ సెంటర్లో ఉన్న రంగా విగ్రహానికి గురువారం ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంగాను ఒక కుల నాయకుడిగా పరిగణించడం సమంజసం కాదన్నారు. ఆ రోజుల్లో బలహీన వర్గాలకు, కార్మికులకు ఇళ్ల స్థలాల కోసం ఆమరణ దీక్ష చేస్తూ ఆయన హత్యకు గురయ్యారన్నారు. తన జీవితకాలంలో కార్మికుల అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి రంగా అని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి




పాలకొల్లులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల

వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ రాజ్యాధికారం దక్కని జాతి మనుగడ కోల్పోతుందని చెప్పిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను గుర్తు చేసుకుంటూ కాపు కులస్థులంతా ఆ దిశగా అడుగులు వేయాలని, రాష్ట్రంలో అధిక సంఖ్యలో జనాభా కలిగి బలమైన వర్గంగా ఉన్న కాపులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం చేపట్టినపుడే రంగా ఆశయం నెరవేరినట్లు అన్నారు. ఆనాడే రంగాకు ఘనమైన నివాళులు సమర్పించినట్లని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు, రంగా యూత్ అధ్యక్షులు మండెల రజనీ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఛాంబర్ అధ్యక్షులు కెవిఆర్.నరసింహారావు, పెనుమాక రామ్మోహన్, చవాకుల సూర్య నరేష్, కొమ్ముల మురళీ, వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, చేగొండి సూర్యప్రకాష్, నడపన గోవింద రాజులు నాయుడు, జనసేన నాయకులు బోనం చినబాబు, తులా రామలింగయ్య, సిడగం సురేంద్ర, మైగాపుల పద్మజ, గుండుమోగుల వీరాస్వామి పాల్గొన్నారు.

పేదలకు భోజనాలు, పండ్లు, దుప్పట్లు పంపిణీ

భీమవరం టౌన్ : ఒక తరాన్ని శాసించి ఆదర్శంగా నిలిచిన కీర్తిశేషులు వంగవీటి మోహనరంగ రాజకీయపరంగా, సామాజిక పరంగా అందరి మనస్సులో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. గురువారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయ రోడ్డులోని వంగవీటి మోహన్ రంగ విగ్రహం వద్ద మోహన్ రంగ 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంఎల్ఎ అంజిబాబు రంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మోహన్ రంగ అని అన్నారు. రంగ మిత్ర మండలి జిల్లా గౌరవాధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు, మిత్ర మండలి నాయకులు అగ్గిశెట్టి సిడ్నీ, బొర్రా బాలాజీ, యిర్రింకి సూర్యారావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభిమాన పాత్రుడిగా నిలిచారని, వారి త్యాగం మరువలేనిదని, వారి ఖ్యాతి చెదరదని అన్నారు. ప్రతి ఏడాది మోహన్ రంగ జయంతి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలను చేస్తున్నామని అన్నారు. అనంతరం వృద్ధులకు, పేదలకు పండ్లు, దుప్పట్లు, భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బొకూరి విజయరాజు, అగ్గిశెట్టి సాయి, యర్రంశెట్టి శివకృష్ణ, కోయ రాంబాబు, చల్లా రాము, కొప్పినిడి బాబీ, పోకల కిషోర్, రట్నాల శ్రీనివాస్, గంటా సుందర్ కుమార్, విజ్జురోతి రాఘవులు, సుంకర చంద్ పాల్గొన్నారు.



నరసాపురం : రంగా, ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసాపురం : పట్టణంలోని కోటిపల్లి వారి సెంటర్లో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా, ఇందిరాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు, నరసాపురం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా), నరసాపురం బిజెపి ఇన్‌ఛార్జి మేకల సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు రంగా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నరసాపురం జనసేన కార్యాలయంలో వంగవీటి మెహనరంగా 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు రంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంగవీటి అందరివాడని, ఆయన బడుగు, బలహీన వర్గాల కోసం పాటుబడిన మహోన్నతమైన వ్యక్తని అన్నారు. భౌతికంగా అయన మన మధ్యన లేనప్పటికీ, ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచి, చెరగని ముద్ర వేశారని అన్నారు. చివరి శ్వాస వరకు పేదల పక్షాన పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కం బాబ్జి, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, నిప్పులేటి తారకరామారావు, దివి సత్యన్, గంటా కృష్ణ, లక్కు బాబి పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) భీమవరం

O.S.No.563/2022

Plaintiff :
The Karur Vysya Bank Ltd., represented by its Authorized Officer

And

Defendants :
1.Badraadri Vijaya Lakshmi and another

Address of the Defendants 1&2:
1.Badraadri Vijaya lakshmi, W/o.Sandeep, R/o.D.No.4-1, Main Road, Veeravasaram, W.G.Dist., A.P.
2.Badraadri Sandeep, S/o.Appa rao, Hindu, R/o.D.No.4-1, Main Road, Veeravasaram, W.G.Dist., A.P.

పై నెంబర్ దావాలో ప్రతివాదులైన మీరు కోర్టు సమన్లు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరించుటచే శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా అమలు పరచుటకు, **ది.30-12-2024** వాయిదా వేసి ఉన్నారు. వాయిదా తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని మీ అడ్వకేట్‌తో గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల పై నెంబర్ దావా గ్రంథంలో మీకు పరోక్షంగా తీర్మానించబడును.

Sivangula Subbarayudu
భీమవరం Advocate, Bhimavaram.
తేది.10.8.2024 Cell:9963285565



ఉండి : ఆవిర్భావ వేడుకల్లో నేతలు

పలుచోట్ల సిపిఐ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛా, స్వాతంత్రాల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఘన చరిత్ర సిపిఐకే దక్కిందని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. పార్టీ ఆవిర్భావం మొదలు నేటి వరకు అంటరానితనం, సమాన హక్కులు, సమసమాజ నిర్మాణం, మత సామరస్యం కోసం సిపిఐ అవిశ్రాంతంగా పోరాడిందని భీమారావు తెలిపారు. సిపిఐ నూరు వసంతాల పండుగను పురస్కరించుకుని భీమవరంలో గురువారం ప్రజా ప్రదర్శన, భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భీమారావు మాట్లాడుతూ రష్యా విప్లవం స్ఫూర్తితో 1925 డిసెంబర్ 26న కాన్పూరులో సిపిఐ ఆవిర్భవించిందని, సంపూర్ణ స్వాతంత్రమే లక్ష్యంగా ఉద్యమించిందని, వేలాది మంది కమ్యూనిస్టులు జైళ పాలయ్యారని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి: సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉండి సిపిఐ కార్యాలయం వద్ద ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజలకు న్యాయం చేసేందుకు సిపిఐ నిరంతరం పోరాడుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చే వరకు ఒక మాట, అధికారం చేపట్టిన తర్వాత మరొక మాట మాట్లాడటం నేటి పాలకులకు పరిపాటిగా మారిందని ఆయన విమర్శించారు. అనంతరం సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సనపల శ్రీనివాస్, తమరాని శ్రీనివాస్, కోన గొల్లయ్య, పీతల రవి, బండ్రెడ్డి సోమయ్య, వీర్నపల్లి పెద్దులు, గంగాధర్ కుమార్ పాల్గొన్నారు.

సీసలిలో అన్నదానం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామంలో వేంచేసి ఉన్న సాయిబాబా మందిరంలో బాబాను దర్శించుకోవడానికి యాత్రికులు బార్లు తీరి దర్శించుకున్నారు. గురువారం కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు. ఈ సందర్భంగా సీసలి గ్రామానికి చెందిన ఉండి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ తోట ఫణిబాబు కుమారులు రూపేష్ జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాబా వారికి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట హరిబాబు, వంశీకృష్ణ, పురుషోత్తం, యాత్రికులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.34/2023

Between:
వాది : తాళ్ళూరి వెంకట సత్యనారాయణ
Vs
ప్రతివాది : నంద్యాల భవాని లక్ష్మి ప్రసాద్, S/o.సూర్యనారాయణ, డోర్‌నెం.1-74/1, లంకలకోడేరు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

మీ పై ప్రామిసరీ నోటు బకాయి రాబట్టుకునే నిమిత్తం దావా దాఖలు చేయటం జరిగింది. మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపినా మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి **ది.6-01-2025న ఉ.10.30 ని॥లకు** మీరు వ్యక్తి గతంగా గాని మీ ప్లీడరు ద్వారా గాని మీ వాదన తెలియ జేయవలసినదిగా కోరుచున్నాము. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మానించబడును.

డి.సుబ్రహ్మణ్యం
పాలకొల్లు అడ్వకేట్, పాలకొల్లు.
ది.25-12-2024 సెల్: 98491 73674.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జంగారెడ్డిగూడెం వారి కోర్టులో

O.S.No.65/2023

Between:
మాధవరపు రాజు ...వాది
Vs
1.బేతిన వెంకటలక్ష్మి
2.బేతిన సోమరాజు ...ప్రతివాదులు

ప్రతివాదులు :
1.శ్రీమతి బేతిన వెంకట లక్ష్మి, భర్త : సోమరాజు, వయస్సు 52 సం॥లు, డోర్‌నెం.8-181, అశోక్‌నగర్, కొయ్యలగూడెం, ఏలూరు జిల్లా.
2.శ్రీ బేతిన సోమరాజు, తండ్రి శ్రీరామమూర్తి, వయస్సు 55 సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.8-181, అశోక్‌నగర్, కొయ్యలగూడెం, ఏలూరు జిల్లా.

పై నంబరు దావాలో 1,2 ప్రతివాదులు అయిన మీకు తెలియచేయునది ఏమనగా : పై నంబరు దావాలో మీపైన వాది గారు దావాలో పరిహారము నిమిత్తం శ్రీకోర్టు వారి యెదుట దావా వేసి ఉన్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం **ది.28-01-2025** తేదీకి వాయిదా వేసినారు. సదరు మెయిన్ దావాలోను మరియు I.A.No.168/2023 పిటిషన్‌లోనూ మీకు యెన్నిసార్లు శ్రీకోర్టు వారి ద్వారా సమన్లు, నోటీసులు పంపించినా మీరు తీసుకోకుండా ఉన్నందున, మీ ఇరువురి హాజరు నిమిత్తం **ది.28-01-2025** తేదీకి శ్రీకోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు. కనుక ఆరోజు అనగా **ది.28-01-2025** తేదీన ఉదయం 10-30 ని॥లకు మీరు ఇరువురు పైన తెలిపిన శ్రీకోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ తరపు సమాధానము దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడును. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

P.S.R.K.లక్ష్మణరావు, B.A., B.L.
అడ్వకేటు,
Station:Jangareddigudem జంగారెడ్డిగూడెం.
Date:26-12-2024. సెల్: 9440328779.